సాక్షి
నారాయణపేట
గురువారం । 20 । మార్చి । 2025



26 రోజులైనా...

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 26 రోజులైనా కార్మికుల జాడ తెలియలేదు.

వివరాలు 2లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32 (గురువారం సాయంత్రం)

సహర్ 4-57 (శుక్రవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.2 /19.9

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



నారాయణపేట: జిల్లా పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ప్రజల భద్రతపై భరోసా కల్పిస్తూ మెరుగైన సేవలు అందించాలని అందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. కేసులు పెండింగ్‌లో లేకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని, పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ నూతన సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలనిఅన్నారు. సమావేశంలో డీఎస్పీ లింగయ్య, సిఐ లు శివ శంకర్, రాజేందర్ రెడ్డి, రామ్ లాల్, సైదులు, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, రాజు, విజయ్, రమేష్, రాము, భాగ్యలక్ష్మి రెడ్డి, నవీద్, కృష్ణం రాజు, సునిత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ జ్యోతి అధికారులను అదేశించారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో మద్దూరు, కొత్తపల్లి మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓ పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి తదితర ఆంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నీటిని వృథా చేయకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై పూర్తి అవగాహన కల్పించి నిర్మాణం ఎంత వరకు జరిగితే అంత బిల్లులు వస్తాయని వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాంచందర్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, కృష్ణరావ్, ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లకుసుమలు క్వింటాల్ రూ.4,109

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నల్లకుసుమలు క్వింటాల్‌కు గరిష్టం, కనిష్టంగా రూ.4,109 ధర పలికాయి. అలాగే, పెసర గరిష్టం, కనిష్టంగా రూ.7,475, వేరుశనగ గరిష్టం రూ.5,449, కనిష్టం రూ.5,020, జొన్నలు గరిష్టం రూ.4,735, కనిష్టం రూ.2,812, అలసందలు గరిష్టం రూ.7,176, కనిష్టం రూ.5,109, ఎర్ర కందులు గరిష్టం రూ.7,311, కనిష్టం రూ.6,069, తెల్ల కందులు గరిష్టం రూ.7,305, కనిష్టం రూ.6 వేలు పలికాయి.

మెనూ అమలు తప్పనిసరి



దామరగిద్ద: గురుకుల పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రం సమీపంలోని సింగారం చౌరస్తాలోని భవనంలో కొనసాగుతున్న దామరగిద్ద ఎస్సీ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ సమక్షంలో విద్యార్థుల సంఖ్య, మెస్ రిజిస్టర్‌లు, భోజన వసతిని పరిశీలించారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఎలా ప్రిపేర్ అవుతున్నారని ఆరా తీస్తూ స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. పాఠశాలలో 6వ తరగతి నుండి ఇంటర్ వరకు 549 మంది విద్యార్థులు ఉంటున్నారని ప్రిన్సిపల్ వివరించారు. అయితే, మెయిన్‌గేట్, హెడ్‌లైట్ లేకపోవడంతోపాటు గదుల కొరత పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్‌ను విద్యార్థులు కోరారు.

మోదం.. ఖేదం

ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకే ప్రాధాన్యం

- కేఎల్ఐకు రూ.800 కోట్లు కేటాయింపు
- 'పాలమూరు-రంగారెడ్డి' ఎత్తిపోతలకు మరోసారి నిరాశే
- నల్లమలలో పర్యాటక అభివృద్ధికి రూ.242 కోట్లు
- రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి పాలమూరు జిల్లాకు నిరాశే మిగిల్చింది. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు అధిక మొత్తంలో నిధులు సమకూరుస్తారని భావించగా, బడ్జెట్‌లో కేవలం రూ.2,514 కోట్ల మేరకే కేటాయింపులు దక్కాయి. ఈ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు బడ్జెట్‌లో ప్రస్తావించింది. ప్రధానంగా ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్, సంగంబండ, నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లను పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఈసారి బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. బుధవారం అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

– సాక్షి, నాగర్‌కర్నూల్



ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలో మొత్తం 14.5 లక్షల ఎకరాల్లో సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు ఈ బడ్జెట్‌లో నిరాశే మిగిలింది. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు ఇంకా కనీసం రూ.20 వేల కోట్లు అవసరం ఉంది. అలాగే ఇప్పటి వరకు చేపట్టిన పనులకు దాదాపు రూ.9వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ ఈ బడ్జెట్‌లో మాత్రం ప్రభుత్వం రూ.2,514 కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాది బడ్జెట్‌లోనూ ప్రభుత్వం రూ.2 వేల కోట్లే కేటాయించగా, ఆ మాత్రం నిధులను కూడా ఖర్చు చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. సరైన నిధుల కేటాయింపులు లేకపోవడంతో ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగే పరిస్థితులు కన్పించడం లేదు.

'పాలమూరు'కు ఇచ్చింది రూ. 2,514 కోట్లే..



కోయిల్‌సాగర్, సంగంబండకు కేటాయింపులు



పెండింగ్‌లో ఉన్న కోయిల్‌సాగర్, సంగంబండ, నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. కోయిల్‌సాగర్‌కు రూ.80.73 కోట్లు, నెట్టెంపాడు ప్రాజెక్ట్‌కు రూ.144 కోట్లు, సంగంబండకు రూ.98.08 కోట్ల నిధులను కేటాయించింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌కు అవసరమైన కేటాయింపులు దక్కడంతో పెండింగ్‌లో ఉన్న దేవరకద్ర గ్రావిటీ కెనాల్, ఎడమ కాల్వ, డిస్ట్రిబ్యూటరీ కాల్వల పనుల్లో వేగం పెరుగనుంది. సంగంబండ కింద చేపడుతున్న భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తిచేయనున్నారు.

కేఎల్ఐ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు..



ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, విస్తరణ పనులను పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది. ఇందుకోసం ఈసారి బడ్జెట్‌లో రూ.800 కోట్లను కేటాయించింది. గతేడాది సైతం రూ. 715 కోట్లు కేటాయించగా, ఈసారి మరికొంత నిధులను పెంచింది. కల్వకుర్తి కింద పెండింగ్‌లో ఉన్న 28, 29, 30వ ప్యాకేజీలను పూర్తిచేయడం ద్వారా ఆయా ప్రాజెక్ట్‌లకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

■ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించింది. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత కింద పెన్షన్ల పంపిణీ పథకాలకు నిధులను సమకూర్చింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ. 31,605 కోట్లు కేటాయించడం ద్వారా గ్రామీణ రోడ్లు, గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది లబ్ధిపొందనున్నారు.



■ ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియ పూర్తయిందని చెబుతూ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. దీంతో ఇప్పటివరకు రుణమాఫీ కాని రైతుల పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నల్లమల పర్యాటకంపై దృష్టి..



రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త టూరిజం పాలసీ ద్వారా పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయనుంది. ఇందులో భాగంగా నల్లమల అటవీప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి రూ.242 కోట్లను కేటాయించింది. ఈ నిధుల ద్వారా పర్యాటక అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రణాళిక రూపొందించనుంది. టైగర్ సఫారీ, ఎకో టూరిజం, కృష్ణానదిపై లాంచీ స్టేషన్లు, జెట్టీలు, వాటర్ స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి పర్చనున్నారు.

■ నల్లమలలో పర్యాటక అభివృద్ధితో పాటు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలు, ట్రెక్కింగ్ మార్గాలను అభివృద్ధి చేయనుంది. కృష్ణాతీరంలోని సోమశిల వద్ద బోటింగ్, క్యాంపింగ్, కారవాన్ క్యాంపింగ్ సదుపాయాల కోసం ప్రణాళిక చేపట్టింది.

కురుమూర్తిస్వామి ఆలయాభివృద్ధికి రూ.110 కోట్లు



పాలమూరు ప్రజల ఆరాధ్యదైవం అమ్మాపురంలో ఉన్న కురుమూర్తిస్వామి ఆలయానికి ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఘాట్ రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఇందుకోసం 20-25 ఎకరాల స్థలాన్ని కేటాయించి, నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నారు.

ఇది వాస్తవిక బడ్జెట్



మాది ప్రజా ప్రభుత్వం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఆదాయ వ్యయాలను ఉన్నది ఉన్నట్లుగా ప్రజలకు తెలియజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు పెద్దపీట వేసింది. తెలంగాణలోని అన్ని వర్గాల ఆకాంక్షలకు అద్దం పట్టింది.

– చిట్టెం పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

బీసీలకు అన్యాయం



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామంటూ ప్రభుత్వం ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వంపై నెడుతోంది. మంత్రి వర్గంలో బీసీలకు తగిన ప్రాధాన్యత ఎక్కడ. ఈ బడ్జెట్‌లో కేవలం 5 శాతమే బడ్జెట్ కేటాయించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రేకుల షెడ్‌లో నడుస్తుంది. కొడంగల్ నియోజకవర్గానికి కేటాయించిన బడ్జెట్‌లో పది పైసాలు నారాయణపేటకు రావడం లేదు. ఇది కాంగ్రెస్ బడ్జెట్. ఈ బడ్జెట్ బీసీలకు అన్యాయం చేశారు.

– సత్యయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకు సమన్యాయం



అన్ని వర్గాల సమన్యాయం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇంత పెద్ద మొత్తంలో బడ్జెట్ ప్రవేశ పెట్టడంతో ఎంతో ఆనందంగా ఉంది. ఇందిరమ్మ రాజ్యంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్-2025-26 రాబోయే పదేళ్లలో తెలంగాణ మరింత అభివృద్ధి దిశగా అడుగులేసేందుకు దోహదపడుతుంది. వైద్యం, విద్య, సాగునీటి పారుదల శాఖలకు నిధులు కేటాయించి ప్రాధాన్యత కల్పించింది.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

నిరాశపర్చింది..



రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ప్రతి నెల రూ.2500 ఇస్తామన్న హామీ ఊసేలేదు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.8వేల కోట్లు కేటాయించడం ఏమాత్రం సరిపోదు. ప్రభుత్వ లెక్క ప్రకారం రూ.22వేల కోట్లు కేటాయిస్తే పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. ఉపాధిహామీ పథకం పనులకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా పది శాతం నిధులు కేటాయించాలి. కానీ నయాపైస కేటాయించలేదు.

– గోపాల్, టీవీకేఎస్ జిల్లా కార్యదర్శి, నారాయణపేట

పాలమూరు యూనివర్సిటీకి రూ.50 కోట్లు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈసారి బడ్జెట్‌లో పాలమూరు యూనివర్సిటీకి కేటాయింపులు పెరిగాయి. గతేడాది యూనివర్సిటీకి వేతనాల కోసం రూ.11 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఈ ఏడాది రూ.200 కోట్లు అభివృద్ధి కోసం, రూ.66 కోట్లు వేతనాల కోసం ప్రతిపాదించారు. వేతనాల్లో కొత్తగా వస్తున్న ఇంజినీరింగ్, లా కళాశాలు, పీజీ కళాశాల సిబ్బంది వివరాలు కూడా ఉన్నారు. కాగా..ఈ సారి బడ్జెట్‌లో ప్రభుత్వం సిబ్బంది వేతనాల కోసం రూ.15.19 కోట్లు, అభివృద్ధి కోసం రూ.35 కోట్లును కేటాయించింది. మొత్తంగా పీయూకి రూ.50.19 కోట్లను కేటాయించారు. వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్పలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతం కంటే అధికంగా నిధులు కేటాయించిందని, దీంతో యూనివర్సిటీ మరింత అభివృద్ధి జరుగుతుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యపడుతుందని పేర్కొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

- పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు
- జిల్లాలో పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈఓ గోవిందరాజులు



నారాయణపేట రూరల్: రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా కేంద్రాలకు చేరుకోవాలని.. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించి.. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో జిల్లాను నిలపాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. ఈ నెల 21నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని.. గత పరీక్షలతో పోలిస్తే ఈ సారి కొంత మార్పులు జరిగాయని.. జీపీఏ బదులు మార్కులు ప్రకటించే అవకాశం ఉందని.. పరీక్ష నిర్వహణలో సైతం ఓఎంఆర్ షీట్‌తో పాటు సమాధాన పత్రానికి బదులు 24 పేజీల బుక్‌లెట్ అందుబాటులోకి తీసుకురానున్నారని వివరించారు. ఇక పరీక్ష కేంద్రాల ఎంపిక, అవసరమైన సౌకర్యాలు, పరీక్ష పత్రాలు చేర్చడం తదితర అంశాలపై బుధవారం డీఈఓ గోవిందరాజు 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుంటే చర్యలు

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఆపినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు సైతం 'బీఎస్ఈ.తెలంగాణ.జీఓవీ.ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా తమ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హెచ్ఎం సంతకం లేకుండానే పరీక్షకు నేరుగా హాజరు కావచ్చు. విద్యార్థుల సందేహాల నివృత్తికి జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షలకు సంబంధించి ఏమైన ఇబ్బందులు, ఫిర్యాదులు, సలహాలు తెలియచేయాలనుకుంటే సెల్ నం .9502051806 కు సమాచారం ఇవ్వడానికి అందుబాటులో ఉంచాము.

గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతి

ప్రతి రోజు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష జరుగుతుంది. సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 20 నిమిషాలు అదనంగా ఉంటుంది. భౌతిక, జీవశాస్త్రం పేపర్ గంటన్నర మాత్రమే ఉంటుంది. పరీక్ష హాల్‌లోకి గంట ముందే విద్యార్థులను అనుమతిస్తాం. దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షకు ముందే విద్యార్థుల సమాచారం ఇన్విజిలేటర్లు నమోదు చేసుకుంటారు. గతంలో 11 పరీక్షలు ఉండేవి. ఈ సారి కేవలం ఏడు పరీక్షలు మాత్రమే ఉండనున్నాయి.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా శిక్షణ ఇచ్చాం..

ఈ పరీక్షల నిర్వహణ ప్రతీ టీచర్‌కు సవాల్‌గా మారింది. పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సిలబస్ పూర్తి అయిన వెంటనే ప్రతీరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించడంతో పాటు రివిజన్ టెస్టులు, గ్రాండ్ టెస్ట్, ప్రీ ఫైనల్ పరీక్షలను రాయించి తప్పులను సరిచేసుకునే విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. వందశాతం ఉత్తీర్ణతతో పాటు ఎక్కువ సంఖ్యలో అత్యధిక మార్కులు (జీపీఏ) సాధనకు కృషిచేస్తున్నాం. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులతో ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసి వారి స్థాయికి తగ్గట్లు విషయ పరిజ్ఞానాన్ని అందించాం. చివరగా విద్యార్థులు ఇప్పటి వరకు చదివిన అంశాలనే నివృత్తి చేసుకోవాలి. పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో ఒక రోజు ముందుగానే వచ్చి చూసుకోవడం మంచిది. పరీక్షకు వచ్చే ముందు అల్పాహారం తీసుకోవాలి. గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి.

39 పరీక్ష కేంద్రాలు.. 410 మంది ఇన్విజిలేటర్లు..

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు 7,631 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందుకోసం 39 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. 39మంది సీఎస్, 39మంది డీఓలు, 39 సీసీలు, 410మంది ఇన్విజిలేటర్లతో పాటు స్క్వాడ్ డ్యూటీకి విద్యాశాఖతోపాటు రెవెన్యూ, పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నాం. ఇర కలెక్టర్ చొరవతో అన్ని శాఖలను సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా ఉండేలా మార్పులు చేశాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతీ సెంటర్‌లోని చీఫ్ సూపరింటెండెంట్ రూమ్‌లో సీసీ కెమెరాను ఏర్పాటు చేస్తున్నాం. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశాం. ప్రతీ కేంద్రానికి తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయిస్తున్నాం. శాంతిభద్రతల విషయంలో వారి సహకారంతో 144 సెక్షన్ అమలు చేయిస్తాం.

మనోధైర్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు శిక్షణ
- తల్లిదండ్రులు ఉపయోగించుకొని పిల్లలకు జీవన నైపుణ్యాలు నేర్పించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: దివ్యాంగ విద్యార్థులు ఏ విషయంలో కూడా తక్కువ కాదని వారికి ప్రత్యేకమైనటువంటి నైపుణ్యాలు పుట్టుకతోనే వస్తాయని.. వారిలో గల సృజనాత్మక నైపుణ్యాలను గుర్తించి వెలికి తీస్తే వారు చాలా ప్రతిభా వంతులుగా మారుతారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (అలిమ్ కో) సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఏర్పాటు చేసిన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భవిత సెంటర్లలో ఇస్తున్న ప్రత్యేక శిక్షణ దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకొని వారికి జీవన నైపుణ్యాలు నేర్పించాలని అన్నారు. భవిత సెంటర్లలో వారానికి ఒకసారి ఫిజియోథెరపీ సేవలు అందిస్తారని దీనిని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని తెలిపారు. మనోధైర్యంతో వైకల్యాన్ని జయించి జీవితంలో అత్యున్నత స్థానాలలో స్థిరపడ్డారని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ఓపిక, సహనంతో పెంచి పెద్ద చేయాలని కోరారు. ప్రభుత్వం ద్వారా వారికి వచ్చేటటువంటి ప్రోత్సాహకాలను విద్యార్థులకు అందేలా తగు చర్యలు తీసుకొని వారిని సరిగ్గా పోషించాలని సూచించారు.

వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్

గత ఆగస్టు 24న నిర్వహించిన అసెస్మెంట్ క్యాంపులో నుండి 85 మంది విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలకు కొలతలు తీసుకుని రూ.లక్షల విలువైన ఉపకరణాలను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని సీఎం ఓ రాజేందర్ తెలిపారు. కాలిపర్స్, వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, సిపి చైర్స్, ఎంఆర్ కిట్స్ మరియు రొలేటర్స్ దివ్యాంగులకు అందించారు. అనంతరం డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ.. భవిత సెంటర్లలో చదివే విద్యార్థులకు ఎన్టైటిల్మెంట్స్ స్టైఫండ్ ఎస్కార్ట్ అలవెన్సు రీడర్ అలవెన్స్ ఇస్తున్నామని, భవిత సెంటర్లలో ఫిజియోథెరపీ క్యాంపు, స్పీచ్ థెరపీ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, విద్యా శాఖ అధికారి నాగార్జునరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, అలింకో సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్థాపానికి గురైన ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య వివరాల మేరకు.. 2009 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఆకుల శ్రీనివాస్ (38) జిల్లా కేంద్రంలోని గాడ్స్ కాలనీలో నివాసముంటూ.. స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతడికి ఏడాది క్రితం రోడ్డు ప్రమాదం జరగడంతో తల, చేతులకు గాయాలయ్యాయి. దీంతో ఆరోగ్య సమస్యలు ఏర్పడటం, ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో కొన్ని రోజులుగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఈ క్రమంలో రెండు, మూడు రోజుల నుంచి తన జీవితం మొత్తం అయిపోయిందని చెబుతూ.. ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేసినట్లు తెలిసింది. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి శ్రీనివాస్ ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

యువకుడి బలవన్మరణం


బాబు (ఫైల్)

లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన చింతకింది బాబు (30) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. బాబు బల్మూర్‌లోని ఓ మద్యం దుకాణంలో రోజువారి కూలీగా పని చేసేవాడు. బుధవారం వ్యవసాయ పొలానికి వెళ్లి అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించినట్లు ఎస్ఐ వివరించారు.

కారు, బైక్ ఢీ: ఒకరి మృతి


చంద్రయ్య (ఫైల్)

తాడూరు: కారు, బైక్ ఢీ కొని ఒకరు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుంతకోడూరు సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ గురుస్వామి కథనం ప్రకారం.. గుంతకల్ గ్రామానికి చెందిన కోడేల చంద్రయ్య(35) తన పొలం నుంచి బైక్‌పై గ్రామానికి బయల్దేరాడు. కల్వకుర్తి మండలం తర్నికల్ నుంచి తాడూరు వైపునకు వస్తున్న కారు ఢీకొనడంతో చంద్రయ్య తీవ్ర గాయపడ్డాడు. వెంటనే ఆయనను కల్వకుర్తిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు..

నారాయణపేట రూరల్: కర్ణాటకకు చెందిన ఓ వృద్ధుడు రాష్ట్ర సరిహద్దులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని గుర్మిటకల్ తాలూకా పరమేశ్‌పల్లికి చెందిన మల్లపొల్ల మొగలప్ప (59)కు అన్వార్, జలాల్‌పూర్ గ్రామాల్లో చుట్టాలున్నారు. అప్పుడప్పుడు ఆయా గ్రామాలకు వచ్చి వెళ్లేవాడు. ఎప్పటిలాగే ఈ నెల 16న జలాల్‌పూర్ వెళ్తున్నట్లు చెప్పి ఊరు నుంచి వెళ్లాడు. అతడు రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో బంధువుల ఇంటికి ఫోన్‌చేసి ఆరా తీయగా.. రాలేదని చెప్పడంతో వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం జలాల్‌పూర్ గ్రామ శివారులో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లి చూడగా ఒంటిపై రక్తగాయాలు కనిపించడంతో అనుమానాలు వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

- ఇంటర్ పరీక్షకు గైర్హాజరు

శాంతినగర్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష రాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. స్థానికుల వివరాల మేరకు.. వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి సుభాష్, మానవపాడు మండలం గోకులపాడుకు చెందిన మరో విద్యార్థి శివయ్య అయిజలో పరీక్ష రాసేందుకు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యంలోని జూలెకల్ శివారులో వీరు వెళ్తున్న బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. దీంతో ఇంటర్ మొదటి సంవత్సరం చివరి పరీక్షను వారు రాయలేకపోయారు.

26 రోజులైనా జాడే లేదు


సహాయక బృందాల అధికారుల సమీక్షలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, తదితరులు

అచ్చంపేట/మన్ననూర్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న ఏడుగురు కార్మికుల ఆచూకీ కోసం 26వ రోజు బుధవారం సహాయక బృందాలు సహాయక చర్యలు కొనసాగించినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు సొరంగంలోని పరిస్థితులపై మరోమారు అధ్యయనం చేసి సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మినీ ఇటాచీ ద్వారా తవ్వకాలు చేపట్టి మట్టి, రాళ్లను కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నారు. కేరళకు చెందిన కడావర్ డాగ్స్ గుర్తించిన డి–1, డి–2 ప్రదేశాల్లో సింగరేణి మైన్స్, ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్స్, కడావర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్, దక్షిణమధ్య రైల్వే, జీఎస్ఐ, జలవనరుల శాఖల బృందాలు పనిచేస్తున్నాయి.

అందుబాటులోకి రాని రోబోల సేవలు..

వారం రోజులైనా రోబోల సేవలు అందుబాటులోకి రాలేదు. అటానమస్ పవర్డ్ హైడ్రాలిక్ రోబో అనుసంధానంగా ఏర్పాటు చేసిన వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకు సాంకేతిక సమస్యల కారణంగా సొరంగం వద్దే ఉండిపోయాయి. సొరంగం చివరి పాయింట్ 40 మీటర్ల వద్ద రోబోలతో సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇన్‌స్టాలేషన్, సిగ్నలింగ్ సమస్యగా చెబుతున్నా.. టీబీఎం శకలాలు అడ్డుగా ఉండటంతోనే వీటి సేవలకు అంతరాయం కలుగుతున్నట్లు తెలుస్తోంది. వాటిని పూర్తిగా తొలగిస్తే తప్ప రోబో ద్వారా మట్టి, బురద, రాళ్లు బయటకు తరలించవచ్చని భావిస్తున్నారు.


సొరంగం నుంచి బయటకు తీసుకొచ్చిన టీబీఎం శకలాలు

1,600 టన్నుల స్టీల్, మట్టి తరలింపు..

ఇప్పటి వరకు 800 టన్నుల స్టీల్‌ను లోకో ట్రైన్ ద్వారా, 800 టన్నుల మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలించారు. నాలుగు ఎస్కవేటర్లు, బాబ్ క్యాట్లతో నిరంతరాయంగా మట్టి, స్టీల్ తొలగింపు పనులు చేపడుతున్నారు. లోకో ట్రైన్‌తోనే తరలింపు వేగవంతం అవుతుందని గుర్తించిన అధికారులు ప్రమాద స్థలం వరకు ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. వాటర్ జెట్ సాయంతో బురదను బయటకు తరలించే ప్రక్రియ వేగవంతం చేశారు.

ఎస్కవేటర్లతో పనులు ముమ్మరం..

సొరంగంలో టీబీఎం ప్లాట్‌ఫామ్ భాగాలు కత్తిరించే ప్రక్రియ, ఎస్కవేటర్లతో మట్టి తొలగింపు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి డా. హరీశ్, సింగరేణి రెస్క్యూ జీఎం బైద్య సొరంగం లోపలి పరిస్థితులు వివరించారు. డి–1, డి–2 ప్రదేశాల్లో సహాయక చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్‌తో తొలగిస్తూ మట్టిని ఎస్కవేటర్లు, కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. సహాయక బృందాల ఉన్నతాధికారులు సొరంగం లోపల ప్రమాద స్థలంలో ఉంటూ సహాయక చర్యలు వేగవంతంగా కొనసాగేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని, పర్యవేక్షణ చేపడుతున్నారని చెప్పారు.

కూలీ పనులకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు కూలీల దుర్మరణం
- ఎర్రవల్లి మండలం కోదండాపురం సమీపంలో ఘటన


ఎండీ రఫి (ఫైల్)


హరిజన బీసన్న (ఫైల్)

ఎర్రవల్లి: పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లి వస్తున్న ఇద్దరిని కారు రూపంలో మృత్యువు కబలించి.. రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. కోదండాపురం ఎస్ఐ మురళి వివరాల మేరకు.. మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన హరిజన బీసన్న (36), ఎండీ రఫి (62) కూలీ పని కోసం ద్విచక్ర వాహనంపై మంగళవారం కోదండాపురం వచ్చారు. కూలీ పనులను ముగించుకొని అర్ధరాత్రి సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో కోదండాపురం కోల్డ్ స్టోరేజ్ సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా.. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంగా వస్తూ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి రక్తగాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వారిద్దరు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇరువురు కూలీలకు ముగ్గురు చొప్పున సంతానం ఉన్నారు. మృతుడు హరిజన బీసన్న భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోషించే పెద్ద దిక్కులను కోల్పోయి ఇరువురి కుటుంబాలు రోడ్డున పడ్డాయని.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల వద్ద అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసులు రహదారిపై గస్తీ తిరిగుతుండగా ఎల్కిచర్ల సమీపంలో బొలెరో వాహనంపై అనుమానం వచ్చిన పోలీసులు నిలిపి తనిఖీ చేశారు. వాహనంలో 57 బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారమిచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మమత, సిబ్బంది వచ్చి తనిఖీచేయగా, రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. డీటీ మమత ఫిర్యాదు మేరకు బియ్యం తరలించే వాహనం, వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకి

మిడ్జిల్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి అన్నారు. మండలంలోని వల్లభ్‌రావుపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అధిక డబ్బులకు ఆశపడి తమ ఫోన్లకు వచ్చే ఓటీపీ నంబర్లు చెప్పి మోసపోవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకంపై, సీసీ కెమెరాల వినియోగంపై, బాల్య వివాహాలు, కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

104 వాహనం దగ్ధం


దగ్ధమవుతున్న 104 వాహనం

బిజినేపల్లి: మండలంలోని పాలెం పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం రాత్రి 104 వాహనం దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. పాలెం పీహెచ్‌సీ ప్రాంగణంలో కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న 104 వాహనాలను నిలిపి ఉంచారు. అందులో ఒక వాహనానికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని పూర్తిగా కాలిపోయింది. ఈ విషయమై డీఎంహెచ్ఓ డా.స్వరాజ్యలక్ష్మిని వివరణ కోరగా.. నిరుపయోగంగా ఉన్న 104 వాహనం విలువ రూ. 1.50లక్షలు ఉంటుందని.. దాన్ని ఇప్పటికే వేలం వేసినట్లు తెలిపారు.

సైబర్ ఉచ్చులో పడి.. రూ. 3.20లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి

లింగాల: మండల కేంద్రానికి చెందిన బర్ల శేఖర్ అనే వ్యక్తి సైబర్ వలలో పడి మోసపోయాడు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడులు పెడితే రెట్టింపు అవుతాయని ఆశ చూపడంతో నమ్మిన శేఖర్.. దశల వారీగా రూ. 3.20లక్షలు చెల్లించాడు. చివరకు యాప్ కనిపించక పోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శాంతినగర్‌లో చోరీ

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. మూడు రోజుల క్రితం శాంతినగర్‌కు చెందిన దొండె వెంకట్రాముడు కుటుంబ సభ్యులు కర్నూలులోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. మూడు రోజుల తరువాత ఇంటికి రాగా తలుపులు, బీరువా పగలగొట్టి ఉండగా వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఇటీవల పత్తి అమ్మగా వచ్చిన రూ.5 లక్షలు, బంగారు ఆభరణాలు బీరువాలో ఉంచామని, దొంగలు అన్నీ దోచుకెళ్లారని బాధిత కుటుంబం పేర్కొంది.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

మద్దూరు: ప్రేమపేరుతో నమ్మించి మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి బుధవారం కోస్గి న్యాయస్థానం మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ సైదులు తెలిపారు. వివరాలు.. కొత్తపల్లి మండలంలోని ఓ తండాకు చెందిన 17 ఏళ్ల మైనర్ బాలికను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని బల్లునాయక్‌తండాకు చెందిన ధనావత్ పవన్‌కుమార్ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో పరిచమయ్యాడు. ప్రేమ పేరుతో మోసగించి బాలికపై అత్యాచారం చేసినట్లు బాధితురాలి అన్న మద్దూర్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొని కోస్గి మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు. అతడిని జిల్లా సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

వేప పిండితో పంటలకు మేలు


వేప పిండి


వేప చెక్క

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, డీఏఓ, జోగులాంబ గద్వాల

అలంపూర్: పంటల సమగ్ర పోషక యాజమాన్యంలో వేప ఉత్పత్తులను ఉపయోగిస్తారు. కీటకాలను సమర్థవంతంగా ఎదుర్కొనే అజాడి రక్టిన్ అనే పదార్థం వేప గింజలో సమృద్ధిగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియా నాయక్ సూచించారు. వేప గింజల నుంచి పిండిని తయారుచేసి పంటలకు ఉపయోగించవచ్చని తెలిపారు. వేప పిండిలో ఉండే లక్షణాలు, ఉపయోగాలను ఆయన రైతులకు వివరించారు.

పోషకాలు: వంద కిలోల వేప పిండిలో 3.56 కిలోల నత్రజని, 0.83 కిలోల భాస్వరం, 1.67 కిలోల పొటాషియం ఉంటుంది. వీటితో పాటు కాల్షియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఐదు కిలోల వేప పిండిని 200 లీటర్ల నీటిలో 12 గంటలు నానబెట్టిన తర్వాత పలచటి గుడ్డతో వడగట్టి వచ్చిన ద్రవణాన్ని పంటలకు పిచికారీ చేస్తే అనేక లాభాలు ఉన్నాయి.

ఆహార ధాన్యాల్లో: వరిపంటలో వేప పిండిని యూరియాతో 5:1 నిష్పత్తిలో చల్లితే చీడపీడలు ఆశించవు. 30శాతం నత్రజని ఆదా అవుతుంది. మొక్కలు నత్రజని తీసుకునే శక్తిని పెంచవచ్చు. ఎకరాకు 80 కిలోల వేప పిండిని వాడితే కాయ తొలుచు పురుగు, ఉల్లి కోడును నివారించవచ్చు.

- కంది, పెసర, మినుము, ఆముదం పంటల్లో ఎకరాకు 80 కిలోల వేప పిండి వాడటం వల్ల పురుగుల బెడద తగ్గించవచ్చు. 5శాతం వేప కషాయం పిచికారీతో రెక్కల పురుగుల గుడ్లు పొదగవు.
- వేరుశనగలో ఎకరాకు 100 కిలోల వేప పిండి వాడటం వల్ల వేరు కుళ్లు, కాయకుళ్లు తెగుళ్లను నివారించవచ్చు.

కూరగాయ పంటల్లో: ఎకరా టమాటా తోటతో 200 కిలోల వేప పిండి వేయడం వల్ల పూత రాలడం, కాయతొలుచు పురుగులను తగ్గించవచ్చు. టమాటాకు ఆశించే పాము పొడ పురుగు నివారణకు వేప పిండితో తయారు చేసిన 50 శాతం ద్రవణాన్ని మొక్కలు నాటిన 10–15 రోజుల్లో పిచికారీ చేయాలి.

- క్యాలీఫ్లవర్ ఎకరాకు 100 కిలోల వేప పిండి వాడటంతో కులు తెగులు రాకుండా నివారించవచ్చు.

వాణిజ్య పంటల్లో: పత్తిలో ఎకరాకు 50 కిలోల వేప పిండి వాడటం వల్ల వేరుకుళ్లు తెగులును పూర్తిగా అరికట్టవచ్చు. యూరియాలోని నత్రజని ఎక్కువ కాలం అందుబాటులో ఉండి పూర్తిస్థాయిలో వినియోగించుకుంటాయి.

పండ్ల తోటల్లో: మామిడి, బత్తాయి తోటల్లో 3 కిలోల వేప పిండిని ఏడాది వయసు ఉన్న మొక్కలకు వాడాలి. కాండంతొలుచు, వేరుతొలుచు పురుగులను నివారించుకోవచ్చు. పూత వచ్చే సమయంలో, పిందె సమయంలో 5శాతం వేప ద్రావణం పిచికారీ చేసి చీడపీడల నుంచి కాపాడుకోవచ్చు.

పూలతోటల్లో: పూలతోటలైన కనకాంబరం, లిల్లీ మల్లె తోటల్లో వేప పిండిని వాడటం వల్ల నులిపురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నిరసన


ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

- ఆస్పత్రి ఎదుట బంధువుల ధర్నా
- ఎమ్మెల్యే హామీతో విరమణ

కల్వకుర్తి టౌన్: బాలింత మృతికి వైద్యుల నిర్లక్ష్యం, అంబులెన్స్ డ్రైవరే కారణమంటూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు పట్టణంలోని సీహెచ్‌సీ ముందు బుధవారం నిరసన తెలిపారు. ఆస్పత్రి గేటు ముందు నిరసన తెలపడంతో ఓపీ సమయంలో రోగులు ఆస్పత్రిలోకి రాకుండా ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆస్పత్రిలో వరుస ఘటనలు జరుగుతున్నా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. పోలీసులు అక్కడి చేరుకొని గేటు ముందు ధర్నా చేయటం సరికాదని చెప్పటంతో ఆస్పత్రి ముందు రహదారిపై నిరసన తెలిపారు. పలు పార్టీల నాయకులు పాల్గొని బాధితు కుటుంబానికి సంఘీభావం తెలిపారు. ఆస్పత్రి ముందు నిరసన తెలియజేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఫోన్‌చేసి మాట్లాడారు. మృతురాలి కుంటుంబానికి పరిహారంతో పాటుగా, ఒకరికి ఏదైనా ఉద్యోగం వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. బాలింత మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారికి ఉచితంగా అంబులెన్స్ సేవలు అందించాలని ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత అంబులెన్స్ సేవలపై బాధిత కుటుంబ సభ్యులు మండిపడ్డారు. ఉచిత సేవల కొరకు ప్రారంభించిన ఉద్దేశం బాగానే ఉన్నా దానిని నడిపించే డ్రైవర్‌కు రోగి పరిస్థితి విషమంగా అనిపిస్తేనే వారు సేవలను అందిస్తారని బాధిత కుటుంబసభ్యులు, ఆసుపత్రిలో కొంతమంది సిబ్బంది ఆరోపించారు. సకాలంలో ఆ అంబులెన్స్‌లు స్పందించినా బాలింత మృతిచెందకుండా ఉండేదని కాదన్నారు. వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి , ఎస్ఐలు మాధవరెడ్డి, మహేందర్, కురుమూర్తి, డివిజన్‌లోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా స్టేషన్‌లో అన్ని రైళ్లు ఆపాలి

- దక్షిణమధ్య రైల్వే జీఎంకు విన్నవించిన అఖిలపక్ష నాయకులు


రైల్వే జీఎంకు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నాయకులు

కృష్ణా: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలును నిలపాలని కోరుతూ బుధవారం అఖిలపక్ష నాయకులు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ కుమార్ జైన్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు నల్లబ్యాడ్జీలు ధరించి రైల్వేస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, బీజేపీ జాతీయ నాయకుడు అమర్ కుమార్ దీక్షిత్ మాట్లాడుతూ.. కరోనా కాలం కంటే ముందు ఇక్కడ ప్రతి రైలును నిలిపేవారని తెలిపారు. కృష్ణా గ్రామ సమీపంలోని కృష్ణానదీ తీరంలో పిండ ప్రదానం కోసం ముంబై, బెంగళూరు, గుజరాత్ తదితర ప్రాంతాల భక్తులు వందల సంఖ్యలో ఇక్కడికి వచ్చేవారని గుర్తుచేశారు. కరోనా కాలం తర్వాత కృష్ణా స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపకుండా వెళ్తుండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర రైల్వే మంత్రులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రజల అవసరాలను గుర్తించి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ఉమ్మడి మండల అధ్యక్షుడు నర్సప్ప, నాయకులు మహాదేవ్, నాగేష్, కిష్టప్ప, శంకరప్ప, శంకర్, శక్తి సింగ్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి


ఉల్లి కుప్పలతో నిండిన దేవరకద్ర మార్కెట్‌యార్డు

- క్వింటా గరిష్టంగా రూ. రెండు వేలు.. కనిష్టంగా రూ.1,400

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుకు బుధవారం సుమారు పది వేల బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో మార్కెట్ ఆవరణ ఉల్లి కుప్పలతో నిండిపోయింది. వ్యాపారులు అన్ని కుప్పలకు వేలం వేయడానికి సమయం సరిపోలేదు. మధ్యాహ్నం 2 గంటలైనా వేలం ముగియకపోవడంతో చాలామంది రైతులు ఉల్లిని బస్తాల్లో నింపి విక్రయించారు. కొనుగోలుదారులు ఎగబడి ఎవరికి వారే సంచుల్లో నింపుకొని తూకాలు వేయించుకోవడం కనిపించింది. ఓ పక్క వ్యాపారులు, మరోపక్క రైతులు ఉల్లి విక్రయాలు సాగించడంతో మార్కెట్ అంతా కిక్కిరిసిపోయింది.

కాస్త మెరుగ్గా ధరలు..

బుధవారం జరిగిన బహిరంగ వేలంలో ధరలు గత వారం కంటే కొంత వరకు పెరిగాయి. ఉల్లి బాగా ఆరబెట్టడంతో పాటు నాణ్యతగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి వేలం పాడారు. క్వింటా గరిష్టంగా రూ.2,000 పలికింది. ఇది గత వారం కంటే రూ.400 ఎక్కువ. అలాగే కనిష్టంగా రూ.1,400 నమోదుకాగా.. గత వారం కంటే రూ.300 వరకు పెరిగింది.

50 కిలోల బస్తాలుగా మార్పు..

గతంలో మార్కెట్‌యార్డులో నిబంధన పేరుతో 45 కిలోల బస్తా క్వింటా ధరలో సగం ధరకు విక్రయించేవారు. దీంతో వ్యాపారి 5 కిలోల ఉల్లిని నేరుగా దోచుకునే పరిస్థితి ఉండేది. ఈసారి మార్కెట్ నిబంధనలు సవరించి 50 కిలోల బస్తాలుగా తూకం వేశారు. మార్కెట్ అంతా 50 కిలోల బస్తాలే విక్రయించారు. నాణ్యమైన ఉల్లి బస్తా రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు.. రెండోరకం ఉల్లి రూ.500 నుంచి రూ.700 వరకు విక్రయించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చినవారు వేలాదిబస్తాల ఉల్లిని కొనుగోలు చేయడంతో వ్యాపారం జోరుగా సాగింది.

ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

- బంగారం, రూ.3 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకున్నట్లు వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని ప్యాటగడ్డవీధికి చెందిన జలగరి ముత్తు, గాంధీనగర్‌కు చెందిన దుల్లోల రాజు తాగుడు, జల్సాలు, కోటి పందేలు తదితర వ్యసనాలకు అలవాటు పడి గతంలో గొర్రెల దొంగతనం చేయడంతో పాన్‌గల్ పోలీసులు పట్టుకొని జైలుకు తరలించారు. జైలులో వారికి జడ్చర్లకు చెందిన మూర్తి పరిచయమై తాళం వేసిన ఇళ్లలో దొంగతనం చేస్తే బంగారం, వెండి, నగదు దొరుకుతాయని.. బంగారం, వెండి విక్రయిస్తే డబ్బులు బాగా వస్తాయని తెలిపాడు. అతడి మాటలతో జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లపై రెక్కి నిర్వహించి రాత్రిళ్లు చొరబడి ఇంటి, బీరువా తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లడం ప్రారంభించారు. బుధవారం జిల్లాకేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు వీరిద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. దీంతో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేసిన నేరాలను ఒప్పుకున్నారు. వీరి నుంచి 5 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ కృష్ణ, పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, ఎస్ఐలు జలంధర్‌రెడ్డి, జగన్, రాణి, జయన్న, రామరాజు, ఏఎస్ఐ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అందని బియ్యం

- సీఎంఆర్ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్న మిల్లర్లు
- అధికారుల మిలాఖత్ కారణమా..?
- సన్నబియ్యం దేవుడెరుగు.. ఇచ్చే బియ్యం సంగతేంటి
- నేటికీ 30 శాతం పేదలకు అందని బియ్యం



మహబూబ్‌నగర్ రూరల్: పేదలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం క్షేత్రస్థాయిలో వచ్చేసరికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. ప్రతి నెల ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పట్టణాలు, గ్రామాల్లో ఉన్న రేషన్‌షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. 20 ఏళ్ల క్రితం బియ్యంతో పాటు తొమ్మిది రకాల సరుకులను రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై అందించేవారు. అన్ని నిత్యావసర సరుకులు పోగా.. ఇప్పుడు కేవలం బియ్యం మాత్రమే మిగిలింది. ప్రతి నెల రెండు, మూడు రోజులు ఆలస్యమైనా బియ్యం సరఫరా చేసేవారు. సంక్రాంతికి సన్న బియ్యం సరఫరా చేస్తామన్న ప్రభుత్వ హామీ దేవుడెరుగు.. ఈనెల 19వ తేదీ వచ్చినా కనీసం దొడ్డు బియ్యం కూడా సరఫరా కాకపోవడం జిల్లాలో పేదలకు శాపంగా మారింది. సన్నాల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు దొడ్డు బియ్యం కూడా రాకపోవడంతో తీవ్ర అయోమయంలో పడ్డారు. బియ్యం ఎప్పుడిస్తారోనని సంచులు పట్టుకొని రేషన్‌షాపుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంలో నేడో.. రేపో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

■ వానాకాలం, యాసంగి సీజన్‌లలో రైతుల నుంచి సేకరించిన సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పేదలకు సన్న బియ్యంగా పంపిణీ చేస్తామని స్వయంగా రాష్ట్ర పౌర సరఫరాలశాఖ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. అయితే ఇక్కడ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. సన్న బియ్యంపై డైలమా నెలకొంది. ప్రతి నెల 1వ తేదీ నుంచి బియ్యం కేటాయింపు ఉంటుంది. పౌర సరఫరాల సంస్థ కేటాయింపులు విధించగానే రేషన్‌షాపులకు బియ్యం స్టాక్ వెళ్తుంది. ప్రతి నెల 1వ తేదీలోపే జిల్లాలోని మూడు రేషన్ బియ్యం స్టాక్ పాయింట్ల నుంచి పట్టణాలు, గ్రామాల్లోని 506 రేషన్‌షాపులకు బియ్యం చేరాల్సి ఉండగా.. ఇప్పటి వరకు జిల్లాలో 70 శాతం మాత్రమే బియ్యం చేరుకుంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి దుకాణాలకు బియ్యం సరఫరా కావాలి. అయితే 1వ తేదీ తర్వాత కేటాయింపు ఇవ్వడంతో రేషన్ బియ్యం పేదలకు అందకుండా సమస్యగా మారింది. జిల్లాలో 4,423 మెట్రిక్ టన్నులు కేటాయింపులకు ఇప్పటివరకు 3,900 మెట్రిక్ టన్నులు పంపిణీ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవానికి 70 శాతం మాత్రమే పంపిణీ జరిగిందని తెలుస్తుంది.

■ ప్రతి ఏడాది వానాకాలం, యాసంగి సీజన్‌లలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పేదలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే సీఎంఆర్ విషయంలో మిల్లర్లు తీసుకున్న వడ్లను బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి అప్పగించే విషయంలో మిల్లర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏయే మిల్లులకు ఎంతంత కేటాయింపులు చేస్తున్నారు. తిరిగి వారు ఎప్పుడు బియ్యాన్ని అప్పగిస్తున్నారు. టార్గెట్‌లు ఏ మేరకు ఉన్నాయి అని అధికారులను అడిగితే వారు పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారు. గోడౌన్‌ల కెపాసిటిని బట్టి అలాట్‌మెంట్ చేశామని పైకి అధికారులు చెబుతున్నప్పటికీ.. వాస్తవానికి వీరు రైస్ మిల్లర్లతో కుమ్మక్కు కావడం వల్ల సమయానికి సీఎంఆర్ రైస్ అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఈ సమస్య ఏర్పడిందంటే ఇందుకు కారణం రేషన్‌షాపుల డీలర్లతో అధికారులు కుమ్మక్కు కావడమేనని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మార్చి నెల ఇంకా పేదలకు బియ్యం అందలేదు. నేడో.. రేపో పరిస్థితి చక్కబడుతుందని అధికారులు అంటున్నారు. అలాట్‌మెంట్ ప్రకారం బియ్యం తీసుకెళ్తున్న డీలర్లు అందరికీ బియ్యం పంపిణీ చేస్తారా.. లేక గుట్టుచప్పుడు కాకుండా మాయం చేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌర సరఫరాల సంస్థ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల మధ్య ఉన్న చీకటి ఒప్పందం కారణంగా రైస్ మిల్లర్లు రేషన్ షాపుల డీలర్లు పేదల బియ్యాన్ని పెద్దల పాలు చేస్తున్నారు.

సాంకేతిక సమస్య సాకుగా...

మార్చి నెల పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం సకాలంలో అందకపోవడం గల కారణాలను సాంకేతిక సాకుగా చూపిస్తున్నారు అధికారులు. వారి తప్పిదం వల్ల ఆలస్యం జరిగిందా లేక సీఎంఆర్ చెల్లింపుల్లో మిల్లర్లు మాయజాలం వల్ల ఇబ్బంది కలిగిందా అనేది విచారణలో తేలనుంది.

నేటికీ బియ్యం ఇవ్వలేదు..



ప్రతినెల 20 నుంచి 30వ తేదీలోపు స్టాక్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు బియ్యం చేరుకోవాలి. ఆ తర్వాత 1వ తేదీ నుంచి నుంచి 17వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తాం. అయితే ఈనెల 19వ తేదీ వచ్చినా ఇంతవరకు మా రేషన్‌షాపునకు బియ్యం సరఫరా చేయలేదు. జనం బియ్యం కోసం ప్రతిరోజూ వచ్చి పోతున్నారు. నేడో.. రేపో బియ్యం వస్తే అధికారులు 22 లేదా 25 పంపిణీ చివరి తేదీ అంటారు. బియ్యం సరఫరా నిలిపివేస్తారు. ఇలా ఎన్నోమార్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బియ్యం పంపిణీకి 30వ తేదీ వరకు సమయం ఇవ్వాలి.

– మోహన్‌నాయక్, రేషన్ డీలర్, అన్నారెడ్డి పల్లి తండా, మహమ్మదాబాద్ మండలం

ఒకటి, రెండు రోజుల్లో...



పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్‌బియ్యం సరఫరాలో కొంత ఆలస్యం జరిగింది. ఒకటి, రెండు రోజుల్లో అన్ని దుకాణాలకు బియ్యం పంపేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు 3,900 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా పూర్తయింది. ఈనెల 25వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తాం. – తోట వెంకటేష్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

రూ.7లక్షల విలువైన 47 ఫోన్ల రికవరీ



నారాయణపేట: మొబైల్ పోయిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో కానీ సీఈఐఆర్ వెబ్ పోర్టల్ లో కానీ ఫిర్యాదు చేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గత రెండు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైళ్లు పోగొట్టుకున్న 47 మంది బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి తిరిగి ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నూతన టెక్నాలజీ ఆధారంగా నారాయణపేట జిల్లా పరిధిలో 47 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగిందని, వాటి విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. ఎవరు పాత మొబైల్ ఫోన్లను కొనరాదన్నారు. మొబైళ్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన ఐటి కోర్ కానిస్టేబుల్ రమేష్ ఎస్పీ అభినందించారు.

జాతీయ ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించాలి



ఆర్చరీ క్రీడాకారులతో రాంచందర్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఈనెల 22 నుంచి 27 వరకు జరగనున్న జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ చాటాలని జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి రాంచందర్ అన్నారు. జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు వెళుతున్న 18 మంది క్రీడాకారులను బుధవారం మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో ఆయన అభినందించారు. జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో బోరుబావుల ఏర్పాటు



మన్ననూర్: నల్లమలలో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు, చెంచుపెంటల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు సౌరశక్తితో బోరుబావులు ఏర్పాటు చేయనున్నట్లు మార్చుసా కార్పొరేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. బుధవారం రాంపూర్, పుల్లాయిపల్లి తదితర చెంచుపెంటల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అమిత్ బజోరియా మాట్లాడుతూ.. నల్లమలలోని మన్ననూర్, అమ్రాబాద్, మద్దిమడుగు, దోమలపెంట రేంజ్ పరిధిలో తాగునీటి సమస్యలను అధిగమించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సౌరశక్తితో తాగునీరు అందించే బోరుబావులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయం వరకు ఈ బోరుబావులు పనిచేసే విధంగా రూపకల్పన చేసినట్లు వివరించారు. ఇంతకు ముందు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన ఈ ప్రాజెక్టు వరుసగా రెండేళ్లపాటు బంగారు పథకాలను సాధించిందని తెలిపారు.

తుమ్మిళ్ల నీటిని విడుదల చేయండి



కెనాలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్ కింద సాగు చేసిన పంటలు ఎండుతున్నాయని, తుమ్మిళ్ల లిఫ్ట్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు జూలెకల్ శివారులోని ఆర్డీఎస్ కెనాల్‌లో బుధవారం ధర్నా చేపట్టారు. గత 14 రోజుల క్రితం నిలిచిపోయిన తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఇప్పటి వరకు ఆన్ చేయలేదని, ఇండెంట్ నీరు విడుదల చేసినా రాకపోవడం అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యమని మండిపడ్డారు. రైతుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా కనీసం రెండు తడులైనా నీరు అందజేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజగోపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ ఇందిర



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మానసిక దివ్యాంగులు, వారి తల్లిదండ్రులకు ఉచిత న్యాయ సంబంధమైన సేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డి.ఇందిర అన్నారు. బుధవారం స్థానిక టీచర్స్‌కాలనీలోని బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి వారికి ఆరోగ్యపరమైన చికిత్సలు ఎంతో అవసరమన్నారు. మానసిక దివ్యాంగుల కోసం 24 ఏళ్లుగా ప్రత్యేక పాఠశాలను నిర్వహిస్తున్న గన్నోజు చంద్రశేఖర్‌ను అభినందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నంటి ఉంటుందన్నారు. ఇలాంటి చిన్నారులు, పెద్దలను బుద్ధిమంతులుగా తీర్చిదిద్దడం ఒక మహాయజ్ఞమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ కార్యదర్శి బి.సునీత, సభ్యులు ఆనంద్, మహదేవ్, పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, మాజీ సైనికుడు ఎం.ఆర్.కె.రెడ్డి, వైద్యులు డా.ప్రణతి, డా.నమిత, డా.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండ హుండీ ఆదాయం రూ.35.26 లక్షలు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రెండోసారి హుండీ లెక్కించారు. మొత్తం రూ.రూ.35,26,085 ఆదాయం వచ్చింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన హుండీ లెక్కింపు రాత్రి 7 గంటలకు సాగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సహాయ కమిషనర్ మదనేశ్వర్, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ నీలకంఠ, పాలక మండలి సభ్యులు సుధా, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లి హుండీ ఆదాయం రూ.35.69 లక్షలు



ఎర్రవల్లి: బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. మొత్తం 8 నెలల 8 రోజులకు చెందిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా.. ఇందులో కరెన్సీ ద్వారా రూ.34,09,845, నాణెముల ద్వారా రూ.1,59,440 మొత్తం ఆదాయం 35,69,285 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామన్‌గౌడ్ పేర్కొన్నారు. గద్వాల డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు వెంకటేశ్వరి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. గద్వాల యూనియన్ బ్యాంకు సిబ్బంది, గద్వాల, వనపర్తి, కొత్తకోటకు చెందిన సేవా సమితి సభ్యులతోపాటు బ్యాంకు సిబ్బంది రవికుమార్, ప్రమోద్, ఆలయ సిబ్బంది, అర్చకులు, సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ఆభరణాలు చోరీ

చారకొండ: బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కొంపెల్లి సరిత రోజువారిగా తన ఇంటికి తాళం వేసి తాళచెవిని పక్కన పెట్టి బయటకు వెళ్లింది. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం తీసి ఇంట్లోకి ప్రవేశించి 13 గ్రాముల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి గొలుసులు, రూ.15 వేల నగదును ఎత్తుకెళ్లారు. తాళం చెవిని యథాస్థానంలో పెట్టారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులను దగా చేయకండి

- బొమ్మిడాల కంపెనీ యాజమాన్యంపై పొగాకు రైతుల ఆగ్రహం



పరిశీలించకుండా సీఆర్ చేసిన చెక్కులను చూపిస్తున్న రైతులు

అలంపూర్ రూరల్: దేశానికి రైతులు వెన్నెముక అని అంటున్నారు కానీ గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల సమస్యలు ప్రభుత్వాలకు పట్టడం లేదని పొగాకు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను దగా చేయకండని బొమ్మిడాల పొగాకు కంపెనీ యాజమాన్యంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలంపూర్ మండల పరిధిలోని కోనేరు గ్రామ శివారులోని బొమ్మిడాల కంపెనీ యాజమాన్యంపై పొగాకు చెక్కులకు సరైన ధరను కల్పించకుండా, తెచ్చిన చెక్కులను కనీసం చూడకుండా సీఆర్ చేస్తున్నారని పొగాకు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్కులకు సరైన ధర కల్పించి న్యాయం చేయాలని కోరారు. గ్రామాల్లో ఎఫ్‌టీ పరిశీలించి సరుకును తీసుకురమ్మరని, తీరా కంపెనీ వద్దకు తెస్తే సరుకు నాణ్యత లేదని సీఆర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, కంపెనీ అగ్రిమెంట్ ప్రకారం రూ.15,500 ధర కల్పించాల్సి ఉండగా రూ.8 వేలు, 10 వేలు, 12 వేలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తట్లు వారే ఇచ్చి.. వారే కట్టుకురమ్మని రైతులను ఇబ్బందులు పెడుతున్నట్లు వాపోయారు. 30 మంది రైతుల సరుకును సగం ధరకు కూడా తీసుకోకుండా సీఆర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇబ్బందులకు గురి చేస్తున్నారు

నాణ్యతతో కూడిన సరుకు తెచ్చిన సీఆర్ చేస్తున్నారు. కంపెనీ యాజమాన్యం ఇష్టానుసారంగా ధరలు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కనీసం సరుకు చూసి ధర కల్పించాలి కానీ తిరిగి పంపిస్తున్నారు.

-బాలు, క్యాతూర్

నికోటిన్ తక్కువగా ఉంది

రైతుల తెచ్చిన సరుకులో నికోటిన్ తక్కువగా ఉందని సీఆర్ చేస్తున్నాం. నికోటిన్ లేకుంటే సరుకు తీసుకోమని రైతులకు ముందే చెప్పాం. రైతులు ఇబ్బందులు పడకుండా యాజమాన్యంతో మాట్లాడి తగిన ధర కల్పిస్తాం.

- రవి, భైరి

సంఘాల పోరాటాల ఫలితమే బీసీ బిల్లు



మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ సంఘాల పోరాటాల ఫలితమే బీసీ బిల్లు అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42 శాతం అమలుకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ బిల్లు పెట్టి ఆమోదించడంలో బీసీ సంఘాల పోరాటాల ఫలితంగానే సాధ్యమైందన్నారు. ఆయా కుల, బీసీ సంఘాల ప్రతినిధులు బుగ్గన్న, అశ్విని సత్యం, ఆశన్న ముదిరాజ్, విశ్వనాథ్, కేశవులు, ఆంజనేయులు, సుకుమార్, వీరప్ప, భీమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

డ్రోన్లతో సాగు సులభం

- పల్లెల్లో అందిపుచ్చుకుంటున్న సాంకేతికత
- డబ్బు, సమయం ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు



పాన్‌గల్ శివారులో వరి చేనుకు డ్రోన్‌తో పిచికారీ

పాన్‌గల్: అన్నదాతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు అందుబాటులోకి వస్తుండటంతో కాస్త ఊరట కలిగిస్తుంది. వరి, వేరుశనగ, పత్తి, కంది తదితర పంటలకు డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తుండడంతో భారం తగ్గింది. వేగంగా పనులు పూర్తి చేయడం, తక్కువ ధరకే ప్రక్రియ పూర్తికావడంతో.. చాలా మంది రైతులు అటువైపుగా ఆసక్తి చూపుతున్నారు.

రసాయనిక మందుల ఆదా..

డ్రోన్ సహాయంతో మందు పిచికారీ చేయడంతో రసాయనిక మందులు ఆదా అవుతున్నాయి. డ్రోన్‌తో నాలుగు నుంచి ఐదు నిమిషాల్లోనే ఎకరాకు మందు పిచికారీ చేసే అవకాశం ఉంటుంది. ఎకరానికి సరిపోయే మందు రెండెకరాలకు వస్తుంది. కూలీల ఖర్చులు తప్పుతున్నాయి. డ్రోన్‌తో పిచికారీ కోసం ఎకరానికి రూ.450 నుంచి రూ. 500 తీసుకుంటున్నారు. ఒక రోజుకు 20 నుంచి 30 ఎకరాల వరకు మందులు పిచికారీ చేసుకునే అవకాశం ఉండడంతో కూలీల కొరతను అధిగమించొచ్చు. దీంతో గ్రామాల్లో యువకులు సొంతంగా డ్రోన్లు కొనుగోలు చేసి అద్దెకు నడుపుతూ స్థానికంగా ఉపాధి పొందుతున్నారు. ఖర్చులు తగ్గి రైతులకు మేలు కలగడంతో యువతకు ఉపాధి లభించినట్లవుతుంది. మండలంలో అత్యధిక ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తుండడంతో డ్రోన్లు కొనుగోలు చేసిన వారికి అన్ని కాలాల్లోనూ పని దొరుకుతుంది.

చేతిపంపులతో ఇలా..

రైతులు ఎక్కువగా చేతిపంపు, ఛార్జింగ్ పంపు, పెట్రోల్‌తో నడిచే పంపులతో పంటలకు మందు పిచికారీ చేస్తుంటారు. ఎకరం పొలానికి మందు పిచికారీ చేయాలంటే గంట నుంచి రెండు గంటల వరకు సమయం పడుతుంది. నాలుగైదు ఎకరాలు ఉంటే రోజంతా అవుతుంది. ఎకరానికి 100 లీటర్లకు పైగానే నీరు అవసరం పడుతుంది. ఒకరు నీరు పోయడం మరొకరు మందు పిచికారీ చేయడం కోసం ఒక్కో కూలీకి రోజుకు రూ.వెయ్యి వరకు ఖర్చు అవుతుంది.

కూలీల సమస్యకు చెక్

రైతులు స్ప్రేయర్‌తో పురుగు మందు పిచికారీ చేయాలంటే సుమారు రూ.వెయ్యి వరకు ఖర్చుయ్యేది. డ్రోన్‌తో కూలీల బెడద తప్పింది. ఖర్చు కూడా సగానికి సగం తగ్గింది. దీంతో రైతులకు సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతున్నాయి. డ్రోన్ బ్యాటరీ కొనుగోలు, వాహనం నిర్వహణకు రూ.10 లక్షల వరకు అవుతోంది. ఇది రైతులకు భారం కావడంతో ఆసక్తి గల యువకులు డ్రోన్లను కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు.

శ్రమ తగ్గింది



డ్రోన్‌తో పిచికారీ వల్ల ఐదెకరాల పొలం అరగంటలో పూర్తయింది. డ్రోన్‌తో అయితే పురుగు మందు పైరు మొదలు వరకు చేరుతోంది. తెగుళ్లు, చీడపీడల నియంత్రణ కొంత వరకు ఆశాజనకంగా ఉంది. డ్రోన్‌తో మందుల పిచికారీతో సమయం, డబ్బు కూడా ఆదా అవుతుంది.

– లింగాల రాములు, రైతు, పాన్‌గల్

కొనుగోలు రాయితీ లేదు



రాయితీపై డ్రోన్ కొనుగోలు చేసే అవకాశం ప్రస్తుతం లేదు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు మాత్రమే రాయితీ వర్తిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. డ్రోన్ల కొనుగోలుకు రాయితీ వస్తే రైతులకు తెలియపరుస్తాం.

– రాజవర్ధన్‌రెడ్డి, ఏఓ, పాన్‌గల్

'ఉద్యమ గొంతుక మల్లు స్వరాజ్యం'



మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కమ్యూనిస్టు ఉద్యమ గొంతుక మల్లు స్వరాజ్యం అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లె గోపాల్ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు మల్లు స్వరాజ్యం ఆదర్శ ప్రాయురాలు అని పేర్కొన్నారు. మహిళా సంఘం నేతగా, ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజలతో మమేకమై వివిధ ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, బి.చంద్రకాంత్, జి.రాజ్‌కుమార్, వరద గాలన్న, సురేష్, ఈశ్వర్, ఆంజనేయులు, భాస్కర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో వివిధ విభాగాలకు హెచ్‌ఓడీల నియామకం



హెచ్‌ఓడీలకు ఉత్తర్వులు అందజేసిన వీసీ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పలు డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించి నూతన హెచ్‌ఓడీలను నియమిస్తూ వీసీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాటనీ హెచ్‌ఓడీగా శివకుమార్‌సింగ్, ఎంబీఏ జావిద్‌ఖాన్, కంప్యూటర్ సైన్స్ సబిత, ఎకానమిక్స్ వెంకట రాఘవేందర్, ఎడ్యుకేషన్ విభాగం ఆంజనేయులు, మ్యాథ్స్ సురేష్, సోషల్‌వర్క్ మాధురిమోహన్, జువాలజీ వేణు, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ రవికుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా కొత్త హెచ్‌ఓడీలను వీసీతో పాటు రిజిస్ట్రార్ చెన్నప్ప శుభాకాంక్షలు తెలిపారు.